క్లుప్తంగా

డిజిటల్ పేమెంట్లపై అవగాహన అవసరం



వేలేరు : మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ అక్తరున్నీసా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థిక ప్రణాళిక, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆర్బీఐ ద్వారా జిల్లాలోని వివిధ మండలాల్లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులు అందించే పొదుపు, రుణ, బీమా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ మల్లికార్జున్, సెంటర్ నిర్వాహకులు పత్తిపాక ప్రదీప్, ఫీల్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



వేలేరు : మండలంలోని పీచరలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ మినీ జాతర హుండీని జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొయ్యడ మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజులు నిర్వహించిన జాతరలో రూ.1లక్ష 65వేల 924ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ మ్యాక రవీందర్, కోఆప్షన్ సభ్యుడు జానీ, ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ శివరాత్రి రవీందర్, డైరక్టర్లు, కోయ పూజారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మహేందర్



ధర్మసాగర్ : ఎస్‌హెచ్‌ఓ(సీఐ)గా ఎ.మహేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధితులు మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయకు సిబ్బంది స్వాగతం పలికారు.

లాయక్ అహ్మద్‌కు గోల్డ్‌మెడల్

హన్మకొండ కల్చరల్: హనుమకొండకు చెందిన కళాకారుడు డాక్టర్ ఎండీ లాయక్ అహ్మద్.. కర్నాటక సంగీతంలో గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ 16వ స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా, గోల్డ్ మెడల్ అందుకున్నారు. అలాగే, వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన సముద్రాల సుదర్శనాచార్యులు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్య విభాగంలో ఎంఏ పూర్తిచేసి గవర్నర్ తమిళిసై నుంచి పట్టా అందుకున్నారు.

పంచాయతీ కార్యదర్శి వర్సెస్ మాజీ సర్పంచ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామపంచాయతీ, మాజీ సర్పంచ్ మధ్య విబేధాలు భగ్గుమన్నాయి. వారి గొడవ కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాల్లోకి వెళ్లితే.. ఇటీవల సీతానాగారం సర్పంచ్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న ఐలయ్య మంగళవారం మద్యం తాగి వచ్చి కుర్చీతో కొట్టడానికి యత్నించడమే కాకుండా పరుష పదజాలాన్ని వినియోగించారని పంచాయతీ కార్యదర్శి స్వప్న పేర్కొన్నారు. గతంలోనూ పలుమార్లు ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడారని స్వప్న ఫిర్యాదులో వివరించారు. కాగా, పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో పంచాయతీ కార్యదర్శి స్వప్న ఎక్కువ పర్సెంటేజీ డిమాండ్ చేశారని మాజీ సర్పంచ్ ఐలయ్య పేర్కొన్నారు. ఈ విషయమై ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

గ్యాస్ సిలిండర్ రాయితీలో నిబంధనలు సడలించాలి

హన్మకొండ: గ్యాస్ సిలిండర్ రాయితీ అమలులో నిబంధనలను సడలించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు కోరారు. మహిళల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉండాలనే నిబంధనతో లక్షలాది మంది ఈ పథకానికి దూరమవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ రీఫిల్ ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. నిబంధనలతో పేదలకు లబ్ధిచేకూరదని తెలిపారు. మహిళలకే వర్తింపజేస్తామనే నిబంధనను ఎత్తివేయాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరుపై ఉన్నా ఆహార భద్రత (తెల్లరేషన్) కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.500లకే గ్యాస్ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

శాస్త్రసాంకేతిక అంశాలపై దృష్టి సారించాలి

- ఎంఈఓ రాంకిషన్‌రాజు
- జిల్లా వ్యాప్తంగా సైన్స్ దినోత్సవం
- ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులు



కమలాపూర్ : విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ రాంకిషన్ రాజు

కమలాపూర్ : మారుతున్న కాలానికనుగుణంగా మూఢనమ్మకాలను వదిలిపెట్టి శాస్త్రసాంకేతిక అంశాలపై విద్యార్థులు దృష్టి సారించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాంకిషన్‌రాజు అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ (బాయ్స్) పాఠశాలలో సైన్స్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొని వారి ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు, నృత్య పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజమల్లయ్య, హెచ్‌ఎంలు పవన్‌కుమార్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, కాంతయ్య, ప్రకాశ్‌రావు, ప్రశాంతి, ఉషారమని, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు కవితాదేవి, సురేష్ విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్లను రూపొందించి ప్రదర్శించారు. వికసిత్ భారత్ కోసం స్వదేశి సాంకేతిక అంశంపై జరిగిన వైజ్ఞానిక సదస్సులో జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం రాష్ట్ర కన్వీనర్, హెచ్‌ఎం ధర్మప్రకాశ్ మాట్లాడారు. ప్రశ్నించడం మానవ చైతన్యానికి, సమాజ ప్రగతికి మూలమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, పద్మజ, రాజమ్మ, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లక్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

మల్లక్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని హెచ్‌ఎం నాగేశ్వరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను సైన్స్ ఉపాధ్యాయులు రాజమహ్మద్, నవీన్ కుమార్, రజిత తిలకించారు. సీవీ రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్టును విద్యార్థులకు వివరించారు. నోబెల్ బహుమతిని పొందిన సీవీ రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్టుకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28వ తేదీన సైన్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనిపర్తి ప్రభుత్వ, సెయింట్ అంటోని పాఠశాల, ధర్మపురం ప్రభుత్వ పాఠశాల, సెయింట్ జోసఫ్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ ప్రదర్శనకు హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు సోమశేఖర్, వినయ్‌కుమార్, ప్రేమ్ రెడ్డి, స్వరూప రాణి, భిక్షపతి, కృపాసాగర్, మైసయ్య, ప్రభాకర్‌రెడ్డి, నరసింహాచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని వివిధ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిట్‌లు ప్రదర్శించారు. వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎగ్జిబిట్ల ప్రదర్శనతో పాటు సీవీ రామన్ నాటికను ప్రదర్శించారు. 50 ఎగ్జిబిట్లు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉత్తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. అలాగే పంథిని ప్రభుత్వ పాఠశాలలో మెడిహీల్ ఆస్పత్రి యాజమాన్యం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని ఏకశిల సీబీఎస్ఈ, స్టేట్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ తిరుపతిరెడ్డి రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు.

పరకాలలో..

పరకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను తిలకించినట్లు తెలిపారు. సైన్స్ విభాగాధిపతులు డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ వి.రాజయ్య, డాక్టర్ జి.ఓదేలు, ఎస్.రాజశ్రీ, అధ్యాపకులు డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, ఆర్.కుమారస్వామి, ఎం.రవికుమార్, డాక్టర్ ఎ.అనిల్‌కుమార్, సి.హెచ్ సుస్మిత, డాక్టర్ పి.సుభాషిణి, సంజయ్, డాక్టర్ జి.స్వప్న, సుమలత, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం అంతర్జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకొని వివిధ రకాల ఎగ్జిబిట్లును తయారు చేయాలని సూచించారు. అనంతరం సైన్స్‌కు సంబంధించిన క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్‌లో పాల్గొన్న విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు.



పరకాల : మాట్లాడుతున్న సంతోష్‌కుమార్



ఐనవోలులో..



ధర్మసాగర్ : ఎగ్జిబిట్లను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



శాయంపేటలో..

'బండి'కి మతిభ్రమించింది

- మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి మతిభ్రమించిందని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న బండి సంజయ్ రాజకీయాల్లో కుటుంబ పరమైన విమర్శలు చేయడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఏం మాట్లాడుతున్నారో అతనికైనా అర్థమవుతుందా అని ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతూ హుస్నాబాద్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పొంతనలేని విమర్శలు చేస్తూ విలువ తీసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా వైఖరీ మార్చుకోకపోతే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అఖండ మెజారిటీ ఇచ్చి గెలిపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలు అమలైతే ప్రజలు బీజేపీని పట్టించుకోరన్న భయంతోనే బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజాహిత యాత్ర వాయిదా

కమలాపూర్ : మండల కేంద్రంతోపాటు ఇల్లందకుంట మండలంలో గురువారం కొనసాగాల్సిన ప్రజాహితయాత్ర శుక్రవారానికి వాయిదా పడినట్లు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగే పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానికి బండి సంజయ్ హాజరు కానున్నారని తెలిపారు. శుక్రవారం కమలాపూర్ నుంచి ప్రజాహితయాత్ర ప్రారంభమై కమలాపూర్, ఇల్లందకుంట మండలాల్లో యధావిధిగా కొనసాగనుందని ఆయన పేర్కొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

వేలేరు : టీ ఎమ్మార్పీఎస్ మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆసంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరటి ప్రభాకర్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా అందె రాజు, ఉపాధ్యక్షుడిగా కొయ్యడ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా రాజయ్య, ప్రచారకార్యదర్శిగా లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిలుగా శంకర్, మునిగడప రమేష్, అధికార ప్రతినిధిగా ఖాసీంను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల గౌరవ అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు



కమలాపూర్ : హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



ఆత్మకూరు : పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తెలంగాణ మోడల్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షకు మొత్తం 465 మంది విద్యార్థులకుగాను 452 మంది హాజరు కాగా 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు జె.రాజ్‌కుమార్, డాక్టర్ జి.అనిత, డిపార్ట్‌మెంటల్ అధికారులు రవీందర్, జగన్‌నాయక్ తెలిపారు.

66 మంది గైర్హాజరు

పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 557 మంది విద్యార్థులకు గాను 497 మంది విద్యార్థులు హాజరయ్యారు. 66 మంది విద్యార్థులు గైర్హజరయినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సంపత్‌కుమార్, ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు కల్పించినట్లు సీఐ రవిరాజ్ తెలిపారు.

ఆత్మకూరులో 9 మంది..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సెంటర్‌లో 189 మందికి గాను 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శోభ తెలిపారు.

పునఃప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి

దామెర : మండల కేంద్రంలో నిర్వహించనున్న దామేశ్వరాలయం (శివాలయం) పునఃప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శివం ట్రస్టు చైర్మన్ బిల్లా రమణారెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయం పరిసర ప్రాంతంలో చలువపందిళ్లు, సామూహిక హోమం, కుంకుమార్చనలు ఇతర కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. మూడు రోజులపాటు భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, మజ్జిగను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో నూతన శోభ సంతరించుకుందని అన్నారు. గ్రామానికి చెందిన పలువురు దాతలు విరాళం అందించినట్లు తెలిపారు. న్యాయవాది సహోదర్‌రెడ్డి, ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, మాజీసర్పంచ్ శ్రీరాంరెడ్డి, ట్రస్టు సభ్యులు అనిల్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సత్యవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి(బంగ్లా రామన్న) శంకర్, కృష్ణమూర్తి, రాజు, కుమార్ ఉన్నారు.

స్వయంపాలన దినోత్సవం



పాల్గొన్న విద్యార్థులు

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి సీఎస్ఐ బీజేఎం ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠశాలు బోధించారు. డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయురాలుతోపాటు మరో 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిబియా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి అన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సామ్‌జార్జ్ పాల్గొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మ దహనం

ఎల్కతుర్తి : ప్రజాహితయాత్రలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై విసిరిన కోడిగుడ్ల దాడిని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని బస్టాండ్ సమీపం వద్ద బీజేపీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీఒక్క హామీని తూచతప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఆరెపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అహర్నిషలు కృషి చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం క్రింద 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కు వంటగ్యాస్ అందిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. పరకాల నుంచి శాయంపేట, ఆరెపల్లి మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, గ్రామంలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పాత పైపులైను మరమ్మతు, కొత్తగా బోరు వేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దుంపల తిరుపతిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల అధికార ప్రతినిధి రవి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శాంతరవి, మార్కండేయ, రవీందర్, నాగరాజు, రవిపాల్, కట్టయ్య, రాజు, రాజేందర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న చెరువులు, కుంటలను వచ్చే ఖరీఫ్ నాటికి మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అలాగే మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీఓ ఫణిచంద్ర, మండల అధికారులు పాల్గొన్నారు.

ఏ తప్పు చేశామో పోలీసులు చెప్పాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు : ఏ తప్పు చేశామని ఇళ్లలోఉన్న తమను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టారో పోలీసులు చెప్పాలని దామెర వైస్‌ఎంపీపీ జాకీర్‌అలీ, బీఆర్‌ఎస్ నాయకుడు ఆవుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాము ఏ తప్పు చేయకున్నా పోలీసులు తీసుకెళ్లి రోకలిబండలు ఎక్కించారని, బట్టలు తొలగించి ఇష్టానురీతిగా కొట్టారని ఆరోపించారు. అగ్రంపహాడ్ జాతరలో జైతెలంగాణ, జై చల్లా అని నినాదాలు చేసినందుకే తమపై అక్రమంగా కేసులు బనాయించి కొట్టారని ఆరోపించారు. కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించామని కేసు పెట్టారని, జాతరలో సీసీ పుటేజీలు పరిశీలిస్తే నిజాలు తెలుస్తాయన్నారు. పోలీసుల తీరుతో ఆశాఖకు ప్రజల్లో నమ్మకం పోతుందని అన్నారు. దామెర బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, ఆత్మకూరు వైస్‌ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, మనోహర్, నాయకులు సాంబశివరెడ్డి, అంకూస్ పాల్గొన్నారు.

'గ్యారంటీ' పథకాల అమలు హర్షణీయం



సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల్లో ఈనెల 27వ తేదీన రెండు గ్యారంటీ పథకాలను అమలు చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హర్షంవ్యక్తం చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం సంతోషకరమన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఉప్పల్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్‌తో పాటు హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విష్ణుదాసు వంశీధర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. రాబోయే కొద్దిరోజుల్లోనే మరిన్ని పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి ఓదెలు, కొండ రమేష్, హనుమాండ్ల వీరేందర్, మిల్కూరి రాజు, జక్కుల రాములు, కనుకుల పరమేష్, పసుపునూటి మొగిలి, మిల్కూరి శ్రీనివాస్, నాయినేని వేణు రావు, ఎలిగేటి రాజమౌళి, వడిగె శ్రీనివాస్, ధర్మారావు, ఆకినపెల్లి భిక్షపతి, మహిళలు పాల్గొన్నారు.

అగ్రంపహాడ్‌లో తిరుగువారం మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం తిరుగువారం మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తులు బంగారం, కొబ్బరికాయలు సమర్పించారు. వెళ్లొస్తాం సమ్మక్క అంటూ ఇంటిదారి పట్టారు. మండలంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో కోలాహలం నెలకొంది.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఎల్కతుర్తి : గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని హనుమకొండ రూరల్ డివిజన్ ఇంజనీర్ సామ్యానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కమలాపూర్, భీమదేవరపల్లి, సబ్‌డివిజన్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముందుగా సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసేముందు రైతులకు, వినియోగదారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. పదోవతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, విద్యుత్ చౌర్యం చేయకుండా మీటర్ ద్వారా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఈ హరిప్రసాద్, ఏడీఈలు కిరణ్, సైదయ్య, రాజు, ఏఈలు లక్ష్మణ్‌నాయక్, రాములు, లక్ష్మణ్, శిరీష్, కుమారస్వామి, కమర్షియల్ ఏఈ సతీష్, సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R): 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O): 9177258410 (హన్మకొండ)